అతివల్లో ఆశలు.. నేతన్నల్లో నిరాశ..





అపెరల్ పార్కులో మంత్రులు ప్రారంభించనున్న టెక్స్‌పోర్టు యూనిట్

- అపెరల్ పార్కుకు తరలివస్తున్న అంతర్జాతీయ పరిశ్రమలు
- వీవింగ్ పార్కులో యూనిట్ల స్థాపన లేక ఎదురుచూపులు
- రూ.386.88 కోట్లతో వర్కర్ టు ఓనర్ పథకం అమలు
- నిరాశనే మిగిలిస్తున్న టెక్స్‌టైల్ జోన్
- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై వరాలు కురిసేనా..?
- నేడు అపెరల్ పార్కులో టెక్స్‌పోర్ట్ కంపెనీ యూనిట్ ప్రారంభోత్సవం
- జిల్లాకు రానున్న ముగ్గురు మంత్రులు..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల మగ్గం బతుకులు ఎప్పుడూ ఆగమే. పొద్దస్తమానం పోగు పోగును పేని అందమైన చీరలు, వస్త్రాలు నేసే నేతన్నలు ఉపాధి కరువై అప్పుల్లో కూరుకుపోతూనే ఉన్నారు. పడుగు పోగులు, ఉరి తాళ్లుగా వేలాడుతుంటే నిత్యం బతుకు చప్పుళ్ల విని పించిన మరమగ్గాలు ఎప్పుడూ నేతన్నలు వెక్కిరి స్తూనే ఉంటాయి. ఈక్రమంలో నేతన్నలకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వ ఆర్డర్లు భరోసా కల్పిస్తు న్నాయి. గత ప్రభుత్వ హయాంలో అందిన ఆర్డర్లలో మార్పులు తీసుకవచ్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వడంలో చేసిన జాప్యం సిరిసిల్ల వస్త్రపరి శ్రమ ఒక్కసారిగా సంక్షోభంలోకి వెళ్లింది. దాదాపు 15మందికిపైగా కార్మికులు ఉరిపోసుకున్నారు. వామపక్ష పార్టీలు, పవర్‌లూం కార్మిక సంఘాలు, వస్త్రోత్పత్తిదారుల సంఘాల ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం మళ్లీ స్వశక్తి మహిళలకోసం చీరలఆర్డర్లు, విద్యార్థులకు యూనిఫాం బట్ట ఉత్పత్తి వంటివి ఇవ్వడంతో ఉపశమనం పొందారు. విద్యుత్ రాయితీ పది హెచ్‌పీల నుంచి 25హెచ్‌పీలకు పెంచారు. కొంత బకాయిల సమస్య వెంటాడుతోంది. స్వశక్తి చీరలకు రూ.50కోట్లతో ఏర్పాటు చేసిన యారన్‌డిపో ఆధారంగా నిలిచింది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్లలో బీడీలు చుట్టే కార్మికులు, వస్త్రోత్పత్తి రంగంలో ఉన్న మహిళలకు గార్మెంట్ రంగంలో ఉపాధి కల్పించ దానికి పూనుకుంది. ఆ దిశగానే సిరిసిల్ల శివారులోని సర్దాపూర్-పెద్దూర్‌ల వద్ద మహిళలకోసం గార్మెంట్ రంగంలో పరిశ్రమలు తీసుకవచ్చే దిశగా అపెరల్ పార్కు, పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే వర్కర్‌టు ఓనర్ పథకంకోసం వీవింగ్ పార్కు నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అపెరల్ పార్కులో వస్తున్న యూనిట్లతో మహిళలకు ఉపాధి లభిస్తుండగా వర్కర్‌టు ఓనర్ పథకం కోసం నేతన్నలు ఎదురు చూస్తూ నిరాశ చెందుతున్నారు. శుక్రవారం అపెరల్ పార్కులో బెంగుళూరుకు చెందిన అంతర్జాతీయ సంస్థటెక్స్‌పోర్టు యూనిట్‌ను ప్రారం భించడానికి చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ప్రారంభించనున్నారు. ఏర్పాట్లను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బిగితేలు పరిశీలించారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

● ఉపాధిని అందిస్తున్న అపెరల్ పార్కు..

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా సిరిసిల్ల పెద్దూర్ శివారులో మహిళ కార్మికుల కోసం 60 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ రూ.174 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లను కేటాయించారు. అపెరల్ పార్కులో గార్మెంట్ రంగంలో మహిళలకు ఉపాధి పొందే దిశగా మహిళలకు జూకీ కుట్టు మిషన్లపై మహిళలకు శిక్షణను అందించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఇదే క్రమంలో అపెరల్ పార్కులో 2021 ఏప్రిల్‌లో గోకుల్‌దాస్ ఇమేజ్ గార్మెంట్ సంస్థ యూనిట్‌ను ప్రారంభించింది. 800మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ ప్రారంభించిన యూనిట్‌ను 1600 మందికి ఉపాధి కల్పించే దిశగా విస్తరించింది. సిరిసిల్ల నుంచి నేరుగా అమెరికా లాంటి దేశాలకు రేడీమేడ్ వస్త్రాలు ఎగుమతి చేస్తుంది. ఇదే దిశగా బెంగుళూరుకు చెందిన అంతర్జాతీయ గార్మెంట్ రంగ సంస్థ టెక్స్‌పోర్టు కంపెనీ యూనిట్‌ను ప్రారంభోత్స వానికి సిద్ధం చేసింది. ఈ కంపెనీ ద్వారా 2 వేల మందికి ఉపాధి లభించనుంది. యూనిట్ ప్రారంభో త్సవానికి నలుగురు మంత్రులు రానున్న నేపథ్యంలో మరింత ఉపాధి అవకాశాలు పెరిగే దిశగా హామీ ఇస్తారని భావిస్తున్నారు.

● వర్కర్ టు ఓనర్ పథకానికి నేతన్నల ఎదురుచూపులు...

సిరిసిల్ల శివారులో నేతన్నలకు ఉపాధికి వారధిగా ఉన్న అపెరల్ పార్కు, వీవింగ్ పార్కులలో నేత కార్మికులు, వస్త్రోత్పత్తిదారులకు ఆశ, నిరాశలుగా మిగిలాయి. అపెరల్ పార్కులో యూనిట్లు ప్రారంభం అవుతుండగా కార్మికులను యజమానులుగా మార్చే వర్కర్‌టు ఓనర్ పథకం కోసం నిరీక్షణ తప్పడం లేదు. ఈ సంవత్సరం ఉగాది నాటికే మరమగ్గాల యూనిట్లను స్థాపించే విధంగా కసరత్తు ప్రారంభించినా ముందుకు కదలడం లేదు. గత ప్రభుత్వం చేపట్టిన వర్కర్ టు ఓనర్ పథకంపై కాం గ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవ డం, నిర్మాణం పూర్తి చేసుకున్న షెడ్లలో ఇతర సంస్థలకు లీజుకు ఇవ్వడంతో పవర్‌లూం కార్మికుల్లో పథకంపై ఆశలు సన్నగిల్లాయి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.386.88 కోట్లతో పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే పథకాన్ని అమలుచేయ డానికి సన్నాహాలు ప్రారంభించడంతో కార్మికుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ యాక్షన్ ప్లాన్ ఏంటో కనిపించకపోవడంతో ఎదురుచూపులే మిగిలిస్తున్నాయి. మరమగ్గాల కార్మికులను యజమానులుగా మార్చేదిశగా వర్కర్ టు ఓనర్ పథకాన్ని రూపకల్పన చేశారు. ఇందుకు అనుగుణంగానే రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు వద్ద వీవింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. 42వీవింగ్ షెడ్ల నిర్మాణం జరిగింది. కార్మికులకు నచ్చే విధంగా సెమీ ఆటో మరమగ్గాలను నమూనాగా ఏర్పాటు చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రం మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద 88 ఎకరాల్లో రూ.374 కోట్లతో వీవింగ్ పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొదటి విడతలో 1,104మంది కార్మికులకు వర్క్‌షెడ్లను నిర్మించి అం దించాలనే లక్ష్యంగా పనులు ప్రారంభిం చారు. రోడ్లు, నీటి వసతి, కరెంట్, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించారు. 46వర్క్‌షెడ్లను నిర్మించా లనే లక్ష్యంగా పెట్టుకొని నిర్మాణాలు 42షెడ్లు పూర్తి చేశారు. ఇందులో కార్మికులకు మొదటి విడతలో 4,416 మర మగ్గాలను గ్రూప్ షెడ్ల కింద అందించ నున్నారు. ఒక్కో కార్మికుడికి 800 చదరపు అడుగుల్లో..

మిగతా 8లో

సారంపల్లిలో వాహన, డ్రైవింగ్ టెస్ట్‌లు


సారంపల్లిలో తనిఖీలు చేస్తున్న ఆర్టీఏ అధికారులు

సిరిసిల్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించిన టెస్ట్‌లు, వాహనాల ఫిట్‌నెస్ పరిశీలనకు సంబంధించి తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ పార్కు, సారంపల్లి వద్దకు మార్పు చేశారు. గురువారం జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్ ప్రారంభించారు. ప్రభుత్వం జిల్లా రవాణా శాఖకు సారంపల్లి వద్ద స్థలాన్ని మంజూరు చేసింది. సిరిసిల్లలో ప్రైవేటు స్థలంలో నిర్వహిస్తున్న వాహనాల టెస్ట్‌లు సారంపల్లిలో నిర్వహిస్తామని, వినియోగదారులు సహకరించాలని లక్ష్మణ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ వంశీధర్, ఏఎంవీఐ రజనీదేవిలు ఉన్నారు.

మహిళా సంఘాలకు ఎరువులు, విత్తనాల దుకాణాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను ప్రభుత్వం మహిళా సంఘాలకు కేటాయించనుందని, అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం అన్నారు. మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఐకేపీ అధికారులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాల నిర్వహణకు మహిళలు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అధికారి అఫ్జల్‌బేగం అన్నారు. సమావేశంలో ఏవో రాజశేఖర్, ఐకేపీ ఏపీఎం మల్లేశం, సీసీలు సుధాకర్, నాగరాజు, మహిళలు పాల్గొన్నారు.

కార్మికుడి ఇంట్లో సన్న బియ్యంతో భోజనం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని ఓ నేత కార్మికుడి ఇంటిలో గురువారం మార్కెట్ కమిటీ చెర్‌పర్సన్ వెలుముల స్వరూపా తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మహిళా విభాగం నాయకులు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్న సన్న బియ్యంతో భోజనం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో అనంతరం మరమగ్గాల నేత కార్మికుడి ఇంట్లో సన్న బియ్యంతో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపాతిరుపతిరెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత నలినీకాంత్ భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి, జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కోడం అరుణ, జిల్లా మహిళా వైస్‌ప్రెసిడెంట్ సామల రోజా, సుధ, సిరిసిల్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి ఖాజా పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నూకలమర్రి గ్రామంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులకు ప్రత్యేపూజలు నిర్వహించిన అర్చకులు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కోనరావుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మట్టిమల్ల గొల్లపెల్లి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించి అమ్మవారికి నైవేద్యం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

గిరిజన నాయకుల ముందస్తు అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లకుండా ఎల్లారెడ్డిపేట పోలీసులు గురువారం అప్రమత్తమయ్యారు. మండలంలోని బుగ్గరాజేశ్వరతండా, బాకురుపల్లితండా, దేవునిగుట్టతండాల్లోని గిరిజన నాయకులు తిరుపతినాయక్, రాజునాయక్, పృథ్వీనాయక్‌లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే సర్కారు పోలీసులతో అరెస్ట్‌లు చేయించడం అన్యాయమన్నారు. ప్రజా పోరాటాలను అడ్డుకోలేరని అన్నారు. అరెస్ట్‌లకు భయపడకుండా రానున్న రోజుల్లో గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజీల్ ధరలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, పట్టణ కార్యదర్శి అన్నల్ దాస్ గణేష్‌లు డిమాండ్ చేశారు. సీపీఎంరాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిరిసిల్ల పట్టణంలో కొత్తబస్టాండ్‌లోని తెలంగాణతల్లి విగ్రహం ఎదుట గురువారం సీపీఎం జిల్లా కమిటీ అధ్వర్యంలో నాయకులు గ్యాస్ సిలిండర్‌తో పెంచిన గ్యాస్ సిలిండర్‌తో పాటు పెట్రోల్, డీజీల్ ధరలను తగ్గించాలంటూ నిరసనలు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, గురిజాల శ్రీధర్, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, బెజుగం సురేష్, గుండు రమేష్, గోవిందు లక్ష్మణ్ పాల్గొన్నారు.

రెండో రోజు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలించనివ్వబోమంటూ రైతులు రెండో రోజు గురువారం ట్రాక్టర్లను అడ్డుకున్నారు. తహసీల్ అధికారులు జారీ చేసిన కూపన్లతో వాగు వద్దకు చేరుకున్న ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. వాహనాలకు అడ్డుగా నిలబడి నిరసన వ్యక్తం చేశారు. దాంతో చేసేదేమీ లేక ట్రాక్టర్లు అక్కడనుంచి వెనుదిరిగాయి. అనంతరం రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేపట్టారు.ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ సుజాత పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈనెల 20 నుంచి నిర్వహించనున్న ఇంటర్, పదవ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంటర్, పదవ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో గురువారం సమన్వయ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశ్న పత్రాలను, కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇతరులు ఎవరూ కూడా పరీక్షా కేంద్రాల్లో ఉండరాదని, గుర్తింపు పొందిన వారిని తప్ప ఎవరినీ కేంద్రాలకు అనుమతించరాదని ఆదేశించారు. ఇంటర్ పరీక్షల కోసం జిల్లాలో 4 సెంటర్లు (సిరిసిల్ల 2, వేములవాడ 2) ఏర్పాటు చేస్తున్నామని, 995 మంది అభ్యర్థులు, 10వ తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షల కోసం ఒక సెంటర్ సిరిసిల్లలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. 264 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. వేసవి దృష్ట్యా వైద్య శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట మహిళా పోలీస్ సిబ్బందికి డ్యూటీ కేటాయించాలని సూచించారు. కేంద్రాల్లో పరీక్ష రాసేవారికి వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి జనార్దన్‌రావు, జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయనియంత్రణ అధికారి, పోలీసు, వైద్య ఆరోగ్య, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ,పోస్టల్, ఇంటర్మీడియట్ విద్య, ఆర్టీసీ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యంపై బీజేపీ రాజకీయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


రుద్రంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీపై బీజేపీ నాయకులు కావాలని రాజకీయం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. రుద్రంగి మండల కేంద్రంలో డీసీఎంఎస్, ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు బీజేపీ నాయకులు ఫ్లెక్సీలు కట్టి సన్నం బియ్యం తాము పంపిణీ చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని, బీజేపీ వారు పంపిణీ చేస్తే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు సన్నం బియ్యం పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. రైతుల సంక్షమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారన్నారు. సన్నపు వడ్లకు క్వింటాల్‌కు 500రూపాయల బోనస్ అందిస్తున్నామన్నారు. వడగండ్ల వర్షలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి పదివేలు నష్టపరిహారం అందిస్తున్నట్లు గుర్తు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో నటరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, గండి నారాయణ, మాడిశెట్టి ప్రభాకర్, గడ్డం స్వామి, పల్లి గంగాదర్, తర్రె లింగం, ఎర్రం రాజలింగం, సిరికొండ రవి, స్వర్గం పరందామ్, అల్లూరి సంతోష్‌రెడ్డి, సూర యాదయ్య, గంధం మనోజ్, పడాల శ్రీనివాస్, పూదరి మహిపాల్, గుగ్గిళ్ల వేంకటేశం, దసారి గంగారాజం, తదితరులు పాల్గొన్నారు.

రామన్నపల్లెలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తంగళ్లపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపల్లెకు చెందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకుడు మందాటి తిరుపతి యాదవ్ చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందాటి తిరుపతి యాదవ్, పిల్లి ఎల్లయ్య, నక్క సురేష్, తక్కల వేగం, పయ్యావుల మల్లేశం, కావటి బాలమల్లు, విడుదల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వేములవాడ ఆర్టీసీ బస్ డిపో మేనేజరు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతందని, వేములవాడ డిపో పరిసర ప్రాంతాల ప్రజలు 99592 25926 నంబర్‌కు కాల్ చేయాలని ప్రకటనలో కోరారు.

ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సీహెచ్ పూజ

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్‌పోటీలకు జిల్లాకు చెందిన అథ్లెటిక్ క్రీడాకారిణి సీహెచ్ పూజ ఎంపికైంది. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెలలో జరగనున్న ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్‌పోటీల్లో పూజ తెలంగాణ రాష్ట్ర జట్టునుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ నెలలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్ విభాగంలో విశేష ప్రతిభచాటి ఏడోస్థానం సాధించి సీనియర్‌మహిళల విభాగంలో జిల్లా నుంచి మొట్టమొదటిసారిగా ఇండియన్ అథ్లెటిక్స్‌పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పూజను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి, అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

కథల పోటీల్లో ఆవునూరు విద్యార్థిని ప్రతిభ



శృతిక

గంబీరావుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన కథలపోటీల్లో ముస్తాబాద్ మండలం ఆవునూరు ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఎలుసాని శృతిక రాసిన కథ ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. ఈ కథల పోటీల్లో ఉభయ రాష్ట్రాల నుంచి 541 కథలు రాగా, అందులో 35 మంది రాసిన కథలను ఎంపిక చేశారు. జూన్ మాసంలో హైదరాబాద్ రవీంద్రభారతీలో శృతికకు సన్మానంతో పాటు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు బాలసాహిత్యానికి చెందిన పుస్తకాలు అందజేస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మన్ తెలిపారు.

మూడు కాళ్ల కోడి



మూడు కాళ్లతో ఉన్న కోడి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లిలోని ఓ పౌల్ట్రీ ఫాంలో మూడు కాళ్ల కోడిని నిర్వాహకుడు గురువారం గుర్తించాడు. గ్రామంలోని రాజిరెడ్డికి చెందిన పౌల్ట్రీ షెడ్‌ను లక్ష్మణ్ అనే వ్యక్తి లీజుకు తీసుకొని బాయిలర్ కోళ్లను పెంచుతున్నాడు. కోళ్లకు మేత వేస్తున్న క్రమంలో మూడుకాళ్ల కోడి లక్ష్మణ్‌కు కనిపించింది. ఈవిషయం గ్రామస్తులకు తెలియడంతో కోడి ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

పిడుగుపాటుతో దున్నపోతు మృతి

గన్నేరువరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో బుధవారం రాత్రి అకాల వర్షంతోపాటు పిడుగుపడగా గ్రామానికి చెందిన రైతున్యాలపట్ల రాజయ్యకు చెందిన దున్నపోతు మృతిచెందింది. సుమారు 30వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని వేడుకున్నాడు.



ఉపాధికి మార్గం పాలిటెక్నిక్ డిప్లొమా

- పదో తరగతి విద్యార్థులకు అవకాశం
- తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య
- పాలిసెట్-25 పిలుస్తోంది

చొప్పదండి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక కాలంలో ఉత్పత్తి రంగానికి, సాంకేతిక విద్య అభ్యసించే వారికి డిమాండ్ అధికంగా ఉంది. అందులో పదో తరగతి పూర్తి కాగానే వెంటనే ఉత్పత్తి ఆధారిత రంగాల్లో చదువుకోవాలనే విద్యార్థులకు పాలిటెక్నిక్ ఒక అద్భుతమైన మార్గం. పాలిటెక్నిక్ కోర్సు చదివిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయి. విద్యార్థులకు 'పాలిసెట్' ప్రవేశ పరీక్ష ద్వారా పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరేందుకు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. పదో తరగతి తర్వాత ఇంజనీరింగ్ టెక్నికల్ కోర్సుల్లో చేరి సత్వర ఉపాధి పొందవచ్చు. అలాంటి విద్యార్థులకు చక్కటి మార్గం పాలిటెక్నిక్ డిప్లొమా. డిప్లొమా కోర్సు పూర్తయ్యాక వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందవచ్చు.


● పాలిటెక్నిక్‌లో చేరి చదువుకుంటే విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుంది. చిన్న వయసులోనే ప్రత్యేకంగా తమకిష్టమైన రంగంలో నైపుణ్యం సాధించొచ్చు. పాలిటెక్నిక్‌లో విద్యార్థులు తక్కువ ఖర్చుతో సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకొని మంచి భవిష్యత్తును రూపొందించుకోవచ్చు. పది పాసైన విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు ఒక సువర్ణ అవకాశం.

● కోర్సుల వివరాలు

పాలిటెక్నిక్‌లో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు ఉంటుంది. పదవ తరగతి నుంచి ప్రశ్నలు ఉంటాయి. డీఈఈఈ, డీఎంఈ, డీసీఎంఈ, సివిల్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ వంటి 24 కోర్సులు ఉంటాయి. కళాశాలలోని ఒక్కో కోర్సులో 60 సీట్లు అందుబాటులో ఉంటాయి. డిప్లొమా అనంతరం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించి పలు కంపెనీలు ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉద్యోగాలు కుడా ఈ డిప్లమా కోర్సు ద్వారా సాధించవచ్చు. ఈ-సెట్ ప్రవేశ పరీక్ష రాసి బీటెక్‌లో నేరుగా ద్వితీయ సంవత్సరంలోకి చేరే అవకాశం ఉంటుంది. అందరి లాగానే బీటెక్ చేసి గ్రాడ్యుయేట్ కావచ్చు. కొన్నికళాశాలల్లో హాస్టల్ సదుపాయాలు కూడా ఉన్నాయి.

● వ్యవసాయ అనుబంధ కోర్సులు

ఇంజనీరింగ్. అగ్రి. వెటర్నరీ హార్టికల్చర్ డిప్లమా కోర్సులలో ప్రవేశం పొందవచ్చు. వ్యవసాయ విద్య విశ్వవిద్యాలయం పరిధిలో రెండేళ్ల అగ్రికల్చర్ డిప్లమా, ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లమా, మూడేళ్ల వ్యవధిలో పూర్తయ్యే డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సులో పాలిసెట్ ద్వారా ప్రవేశం పొందవచ్చు. వెటర్నరీ విశ్వ విద్యాలయం పరిధిలో రెండేళ్ల యానిమల్ హస్బెండ్రీ పాలిటెక్నిక్ కోర్సు, ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో రెండేళ్ల డిప్లమా ఇన్ హార్టికల్చర్ కోర్సుల్లో సీట్ల భర్తీకి పాలిసెట్-25 నోటిఫికేషన్ విడుదల అయ్యింది.



పాలిసెట్ వివరాలు

- ఏప్రిల్ 19 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.
- 100 రూపాయల ఆలస్య రుసుముతో ఏప్రిల్ 23 వరకు, దరఖాస్తు చేసుకోవచ్చు.
- మే13న ప్రవేశ పరీక్ష
- పరీక్ష సమయం 2-30 గంటలు
- 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.

గణితం నుంచి 60 మార్కులు, భౌతిక శాస్త్రం-30, రసాయన శాస్త్రం-30, జీవశాస్త్రం-30 మార్కుల చొప్పున పదవ తరగతి సిలబస్ ప్రశ్నలు ఉంటాయి.

● పూర్తి వివరాలకు https://polycet.sbtet.telangana.gov.in సైట్‌లో చూసుకోవచ్చు.

ఫీజు వివరాలు: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 250 రూపాయలు.

బీసీ, జనరల్ విద్యార్థులకు 500 రూపాయలు.

అర్హతలు : పదో తరగతి పాస్ అవ్వాలి. 2025లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 డిసెంబర్ 31 నాటికి విద్యార్థుల వయస్సు 15 నుంచి 22 ఏళ్ల మధ్యలో ఉండాలి.

ఎదురెదురుగా ఢీకొన్న ఆటో, ఆర్టీసీ బస్సు

● ఆటోలో మందుగుండు సామగ్రిని గుర్తించిన పోలీసులు

గంగాధర, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మధురానగర్‌వద్ద జాతీయ ప్రధానరహదారిపై ఆటో, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు, ఎస్సై తెలిపిన వివరాలప్రకారం టీజీ 02 టిటి1770 నంబరుగల ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తోంది. జగిత్యాల నుంచి కరీంనగర్‌వైపు రెండు నెంబర్లు గల ఆటో(ఏపి36 టిబి5246,ఏపి36డబ్ల్యు6231) గంగాధర మండలం మధురానగర్ జాతీయ ప్రధానరహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆటోలోని బాక్సులను తీసి బయటపడేసి డ్రైవర్ పరారయ్యాడు. విషయాన్ని బస్సుడ్రైవర్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ప్రమాదస్థలంలోని బాక్సులను పరిశీలించారు. బాక్సుల్లో పేలుడు పదార్థాలు(400జిలిటెన్ స్టిక్స్), వాటికి ఉపయోగించే వైరు బెండల్ లభించింది. ఈ ప్రమాదంలో ఎలాంటి నష్టం జరగకపోవడంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సుడ్రైవర్ మెరుగుశ్రీనివాస్ పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి అక్రమంగా, అనుమతిలేకుండా పేలుడు పదార్థాలను తరలిస్తు గుర్తుతెలియని ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆటోలో లభించిన జిలిటెన్ స్టిక్స్

హనుమాన్ ఆలయంలో దొంగతనం

మానకొండూర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయం గ్రామశివారులో ఉండడంతో రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగులకొట్టి హుండీలోని నగదు రూ.15వేలు, 10తులాల వెండిని ఎత్తుకెళ్లారు. గురువారం ఎప్పటిలాగే పూజారి ఆలయానికి వెళ్లగా తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి ఆలయకమిటీకి తెలియజేశారు. కమిటీతో పాటు గ్రామస్థులు ఆలయానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ లక్ష్మీనారాయణ దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని టీఆర్‌నగర్‌లో తనిఖీలు చేయగా ఎండీ.యాసిర్ అనే వ్యక్తి వద్ద 145 గ్రాముల గంజాయిని సీసీఎస్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. గంజాయిని జగిత్యాల రూరల్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ వినోద్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఓ లాడ్జిలో పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. ఎనిమిదిని పట్టుకొని, వారివద్ద నుంచి రూ.16,710 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్‌స్టేషన్ పరిధిలోని నర్సింగాపూర్ గ్రామశివారులో పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 10,180 నగదుతో పాటు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

చికిత్సపొందుతూ గర్భిణి మృతి

కరీంనగర్‌క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రక్తస్రావంతో బాధపడుతూ కరీంనగర్ మాతాశిశుకేంద్రంలో చికిత్సపొందుతూ జంగంపల్లి సంధ్య అనే గర్భిణి గురువారం ఉదయం మృతిచెందింది. కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా తాండూర్ గ్రామానికి చెందిన సంధ్య బుధవారం అనారోగ్యానికి గురైంది. మంచిర్యాలలోని ఒకప్రైవేట్‌ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని, మెరుగైనచికిత్స కోసం కరీంనగర్‌లోని మాతాశిశు కేంద్రానికి వచ్చింది. ఇక్కడచికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలు సంధ్య భర్త జంగంపల్లి జగదీష్ ఇచ్చిన ఫిర్యాదుతి మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పాలకుర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కన్నాల గ్రామానికి చెందిన కొల్లూరి రాయమల్లు (73) ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య అనారోగ్య కారణాలతో గతంలో మృతిచెందడంతో రాయమల్లు ఒంటరిగా ఉంటున్నాడు. పెద్దపల్లిలో నివాసం ఉంటున్న రాయమల్లు కుమారుడు పలుమార్లు అతడివద్దకు రావాలని కోరినా వెళ్లలేదు. భార్య చనిపోయిన విషయాన్ని మనస్సులో పెట్టుకుని మనోవేదనతో బుధవారం సాయంత్రం గడ్డి మందు తాగగా గమనించిన స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన మహ్మద్ అజీజ్(31) అనే యువకుడు బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజీజ్ కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడన్నారు. బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి తన భార్యను డబ్బులు అడిగితే ఇవ్వకపోవటంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అనంతరం అనుమానం వచ్చి గదిలో చూసేసరికి ఉరివేసుకుని ఉన్నాడు. తాగిన మైకంలో అజీజ్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ మృతి

రామడుగు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం వెదిర శివారులోని కరీంనగర్-జగిత్యాల ప్రధానరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్ మున్సిపల్‌కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్ రాజశేఖర్ మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. రామడుగు మండలంలోని వెదిర పరిధిలోని రాజాజీనగర్‌కు చెందిన కుమ్మరి రాజశేఖర్(27) కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తూ అనూహ్యంగా బ్రిడ్జి వద్ద చెట్టుకు ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేములవాడ ప్రధాన రహదారి కొలతల సేకరణ



వేములవాడలో ప్రధాన రహదారిలోని భవనాల కొలతలు వేస్తున్న అధికారులు

వేములవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి ఇరువైపులా దుకాణాలు, భవనాల కొలతలను అధికారులు సేకరిస్తున్నారు. మెయిన్ రోడ్డు విస్తరణలో ఇండ్లు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు కోల్పోనున్న నిర్వాసితుల తుది జాబితా సిద్ధం చేసే క్రమంలో వివిధ శాఖలకు చెందిన 24 మంది అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి గురువారం కొలతలు సేకరించారు.

రేపు పునఃప్రారంభం కానున్న

కాజీపేట్-దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలు

పెద్దపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ కుంభమేళా సందర్భంగా రద్దయిన కాజీపేట్-దాదర్ వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 12వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. నంబర్ 07197/98గల కాజీపేట- దాదర్ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం నుంచి నడవ నున్నది. ఈ రైలు జూన్ 28వ తేదీవరకు ఎగువ, దిగువ ఇరువైపులా 24 ట్రిప్పులు నడవనున్నది. ప్రతీశనివారం కాజీపేటలో ఉదయం 11:30గంటలకు బయలుదేరి పెద్దపల్లిజంక్షన్‌కు 12:36గంటలకు చేరుకోనున్నది. మరుసటిరోజు మధ్యాహ్నం1:26 గంటలకు దాదర్ చేరుకొంటుంది. తిరుగు ప్రయాణంలో ఆదివారం మధ్యాహ్నం3:25 గంటలకు దాదర్‌రైల్వేస్టేషన్ నుంచి బయలు దేరి మరుసటిరోజు సోమవారం రాత్రి7:38 గంటలకు పెద్దపల్లిజంక్షన్‌కు, రాత్రి9:30 గంటలకు కాజీపేట చేరుకోనున్నది. ఈ రైలు కరీంనగర్ జిల్లా జమ్మికుంట స్టేషన్‌లో కూడా ఆగనున్నది. కాజీపేటనుంచి జమ్మికుంట, పెద్దపల్లి, బల్లార్షా, ఆదిలాబాద్, నాందేడ్ మీదుగా ప్రయాణిస్తుంది. నంబర్07195/96గల కాజీపేట- దాదర్, వయాపెద్దపల్లిజంక్షన్, నిజామాబాద్ మీదుగావెళ్లే రైలును ఇంకా పునరుద్ధరించలేదు. ఈరైలును పునరుద్ధరిస్తే 200 కిలోమీటర్ల దూరం తగ్గడంతోపాటు సమయం, డబ్బులు ఆదా కానున్నాయని ఆ రైలును పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం పెద్దపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏసీపీ కార్యాలయంలో డీసీపీ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బండారికుంటకు చెందిన షేక్‌ఆసిఫ్ కొన్నేళ్లుగా ఇతరప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నాడని వెల్లడించారు. ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్న ఆసిఫ్ జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నట్లు డీసీపీ పేర్కొన్నారు. నిందితుడికి గతంలోనూ నేర చరిత్ర ఉందన్నారు. 2016 నుంచి 2024 మధ్య అతనిపై ఎనిమిది గంజాయి కేసులు నమోదయ్యాయని, పిడియాక్ట్ కింద కూడా శిక్ష అనుభవించాడని డీసీపీ తెలిపారు. పోలీసుల నిఘా పెరగడంతో ఆసిఫ్ మొగ్ధుంపూర్‌కు మకాం మార్చాడన్నారు. కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ఆటో నడుపుతూ గంజాయి విక్రయిస్తున్నాడన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌చెందిన సల్మాన్ అనేవ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి విద్యార్థులు, యువతకు విక్రయిస్తున్నాడని తెలిపారు.

పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గంజాయి కోసం ఎదురుచూస్తున్న వారికి వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చి విక్రయిస్తుండగా పోలీసులు అతన్ని పట్టుకున్నట్లు డీసీపీ కరుణాకర్ వివరించారు. రూ.50వేల గంజాయితోపాటు, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిని పట్టుకొన్న సీఐ కె.ప్రవీణ్ కుమార్,ఎస్సై జె. లక్ష్మణ్ రావు,సిబ్బందిని డీసీపీ అభినందించారు.

అకాల వర్షంతో.. అన్నదాతకు నష్టం..

● నేలకొరిగిన మొక్కజొన్న, నేలరాలిన మామిడి ● కళ్లాల్లో తడిసిన ధాన్యం

గన్నేరువరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం అర్ధరాత్రి కురిసిన అకాలవర్షం మాదాపూర్ గ్రామంలో బీభత్సం సృష్టించింది. అకాలవర్షంతోపాటు ఈదురుగాలులతో చేతికి వచ్చిన మొక్కజొన్న పంట నేలకొరిగింది. మామిడితోటల్లో మామిడి కొమ్మలు విరిగిపడడంతో పెద్దమొత్తంలో మామిడి నేలరాలి రైతులకు అపార నష్టం వాటిల్లింది. మాదాపూర్ గ్రామానికిచెందిన రైతులు మాదుగుల మహేష్, గొడుగు స్వామికి చెందిన మొత్తం నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట నేలకొరిగింది. ఇదేగ్రామంలో మామిడితోటల్లో భారీ నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే పంటనష్టాన్ని ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అనంతగిరిలో వడగళ్ల వాన..

ఇల్లంతకుంట: మండలంలోని పలుగ్రామాల్లో పడిన వడగళ్లవానతో భారీగా పంటలకు నష్టంవాటిల్లింది. అనంతగిరి, పెద్దలింగాపూర్, తిప్పపూర్ గ్రామాల సమీపంలోని పంట పొలాలపై బుధవారం అర్ధరాత్రి గంటపాటు రాళ్ల వాన పడింది. దీంతో కోతకు వచ్చిన దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలోని వరిచేన్లు భారీగా దెబ్బతిన్నాయి. తమకు వడగళ్ళు తీరని నష్టం కలిగించాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ మూడు గ్రామాల్లో జరిగిన నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపినట్లు పేర్కొన్నారు.

వేములవాడ రూరల్: బుధవారం అర్ధరాత్రి కురిసిన గాలివాన మండలంలో బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో కురిసిన గాలివానతో తీవ్రపంటనష్టం వాటిల్లింది. బొల్లారం గ్రామంలో వరిపంట నేలకొరిగి ధాన్యం రాలిపోయింది. దీంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాగాయపల్లి గ్రామంలో గాలివానకు రోడ్డుపై విరిగిపడ్డ చెట్లను బ్లూకోల్ట్ పోలీసులు తొలగించారు. ప్రధానరహదారిపైచెట్లు విరిగి పడిపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా పోలీసు సిబ్బంది శ్రీనివాస్, మల్లేశం స్థానికులతో కలిసి తొలగించారు.

తడిసిన ధాన్యం..

కోనరావుపేట/గంభీరావుపేట: కోనరావుపేట, గంబీరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. మంగళపల్లెలో మొక్కజొన్న నేలకొరిగింది. ఒక్కసారి రాత్రి రావడం వల్ల రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఇబ్బందులు పడ్డారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..

ఇల్లందకుంట: ఈదురుగాలులతో నేలకొరిగిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతుసంఘం కరీంనగర్ జిల్లాకమిటీ సభ్యుడు చెల్పూరి రాము అన్నారు. గురువారం మండలంలోని శ్రీరాములపల్లిలో ఈదురు గాలులతో నేలకొరిగిన మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాము మట్లాడుతూ మండలంలో సుమారు 150ఎకరాల వరకు మొక్కజొన్న పంట నేలకొరిగిందన్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఎకరానికి రూ.50వేలు ఇప్పించాలన్నారు. లేకపోతే రైతులందరితో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



కోనరావుపేట మండలం మంగళపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న



గంభీరావుపేట మండలం గజసింగవరంలో వర్షానికి తగిసిన ధాన్యం



వేములవాడ నాగాయపల్లిలో విరిగిపడిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు



అనంతగిరి గ్రామంలో పడిన వడగళ్లు



గన్నేరువరం: నేలవాలిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతు మాదుగుల మహేష్

గల్ఫ్ అడ్వైజరీ కమిటీ గౌరవ సభ్యుడిగా ఆది శ్రీనివాస్




ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమం కోసం రూపొందించనున్న ఎన్నారై పాలసీ అడ్వైజరీ కమిటీ గౌరవ సభ్యుడిగా వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియమితులయ్యారు. అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి బీఎం వినోద్‌కుమార్, వైస్‌చైర్మన్‌గా మంద భీమ్‌రెడ్డి, గౌరవ సభ్యులుగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి, తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్‌ను నియమించారు. సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, లిజీ జోసెఫ్, చెన్నమనేని శ్రీనివాసరావు, కొట్టాల సత్యనారాయణగౌడ్(దుబాయ్), గుగ్గిళ్ళ రవీందర్, నంగి దేవేందర్, పరికిపండ్ల స్వదేశ్‌ను ఈకమిటీలో సభ్యులుగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఎన్ఆర్ఐ పాలసీ రూపకల్పన నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ కమిటీలో జిల్లా నుంచి ప్రభుత్వ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు అవకాశం లభించడం విశేషం.

బాలికపై అత్యాచారయత్నం

ఎలిగేడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం రాములపల్లి గ్రామంలో ఒకటవ తరగతి చదువుతున్న బాలికపై యువకుడు (25) అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం పాఠశాల నుంచి బాలిక ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులకు గ్రామంలో పని ఉండడంతో ఇంటి సమీ పంలో ఉన్న దగ్గరి బంధువు వద్ద బాలికను ఉండమని చెప్పి వెళ్ళారు. దీనిని అదునుగా తీసుకొన్న యువకుడు బాలికపై వికృత చేష్టలకు పాల్పడినట్లు తెలిసింది. ఇంటికి తిరిగివచ్చిన తల్లిదండ్రులకు బాలిక అక్కడ జరిగిన విషయాన్ని ఏడ్చుకుంటూ చెప్పింది. దీంతో తల్లిదండ్రులు జూలపల్లి పోలీసులకు సమాచారం అందించారు.

వస్తున్నాం..అంజన్నా..





విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న అంజన్న ఆలయం

- నేటి నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు
- కొండగట్టులో మూడు రోజుల పాటు వేడుకలు
- తరలిరానున్న లక్షలాది భక్తులు

మల్యాల ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శుక్రవారం నుంచి హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా అంజన్న దీక్షాపరులు, భక్తులు కాలినడకన, వాహనాల ద్వారా అంజన్న సన్నిధికి చేరుకోనున్నారు. దీక్షాపరులు ఇక్కడ మాల విరమణ చేయడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. కొండగట్టులో జరిగే ఉత్సవాల కోసం అంజన్న ఆలయ పరిసరాల్లో క్యూలైన్, బారి కేడ్లు తదితర ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే నిత్యం వేలాదిగా తరలివస్తూ స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 650మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరంతా షిఫ్ట్ పద్ధతిలో దిగువ కొండగట్టు, ఘాట్ రోడ్డు, కొండపైన, ఆలయం, దీక్షవిరమణ మండపం, ప్రసాదాల కౌంటర్, కోనేరు, పార్కింగ్ స్థలాలు, జేఎన్‌టీయూ, దొంగల మర్రి ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు.

నేటి ఆర్జిత సేవలు రద్దు

శుక్రవారం నుంచి సోమవారం వరకు వరకు కొండగట్టు అంజన్న సన్నిధిలో ఆర్జిత సేవలు నిలిపి వేస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. ఏప్రిల్ 11నుంచి 13 వరకు జయంతి ఉత్సవాలు జరగనుండగా ఆర్జిత సేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు తదితర పూజలు ఉండవని భక్తులు సహకరించాలని కోరారు. మళ్లీ ఏప్రిల్ 14 నుంచి ఆర్జిత సేవలు యథావిధిగా కొన సాగుతాయని అన్నారు.

ప్రత్యేక అధికారిగా శ్రీనివాసరావు

కొండగట్టు హనుమాన్ చిన్న జయంతి వేడుకల సందర్భంగా ఉత్సవాలు సజావుగా నిర్వహణకు గాను దేవాదాయ శాఖ ఉత్సవాల ప్రత్యేక అధికారిని నియమించింది. అడిషనల్ కమిషనర్ ఇ.శ్రీనివాస్‌రావును ప్రత్యేక అధికారిగా నియమించడంతో కొండపైన దేవస్థానం అధికారులతో ఆయన కలిసి ఏర్పాట్లు, సౌకర్యాలు పర్యవేక్షిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం: శ్రీకాంత్‌రావు, ఈవో

జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. తాగునీటి కోసం చలి వేంద్రాలు, మొబైల్ చలివేంద్రాలు, పార్కింగ్, క్యూలైన్ తదితర ఏర్పాటు చేశాం. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఉత్సవమూర్తుల యాగశాల ప్రవేశం

మల్యాల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): చిన్నహనుమాన్ జయంతి నేపథ్యంలో వేలాదిగా తరలివచ్చి మాల విరమణ చేసే దీక్షపరుల కోసం కల్యాణకట్ట వద్ద ఏర్పాటు చేసిన మాల విరమణ మండపానికి స్వామి వారి ఉత్సవమూర్తుల తీసుకెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈవో శ్రీకాంత్‌రావు, స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్, రఘు, అర్చకులు, వేదపండితులు ఉత్సవ మూర్తుల దీక్షావిరమణ మండప ప్రవేశంలో పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు: కలెక్టర్ సత్యప్రసాద్

మల్యాల, ఆంధ్రజ్యోతి: చిన్నజయంతి సందర్భంగా కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి కొండగట్టులో ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్, డీఎస్పీ రఘు చందర్, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ ఉన్నారు.

అంజన్న జయంతికి ఏర్పాట్లు..

- కొండపైన, ఘాట్‌రోడ్డుపైన, 28 చోట్ల చలివేంద్రాలతో పాటు మొబైల్ వాహనాల ద్వారా భక్తులకు నీటిని అందించనున్నారు.
- ఘాట్‌రోడ్డుపై వాహనాలకు అనుమతి లేకపోగా కొండపైన బొజ్జ పోతన్న, కొండగట్టు స్టేజీల వద్ద పోలీసుల ఔట్ పోస్టు ఏర్పాటు
- దీక్ష విరమణలకు ప్రస్తుతం ఉన్న అర్చకులకు తోడు మరో వంద మంది సిబ్బంది నియామకం
- కొండగట్టు స్టేజీ సమీపంలోని తుమ్మ చెరువు, కొండపైన బొజ్జ పోతన్న ఆలయం, దొంగలమర్రి-జేఎన్‌టీయూ మార్గంలో బృందావనం రిసార్ట్, జేఎన్‌టీయూ సమీపంలో కొండ పైకి వెళ్లే మార్గంలో, దాని పక్కనే వాహనాల కోసం పార్కింగ్‌కు ఏర్పాట్లు
- పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 366 మంది సిబ్బందితో మూడు షిఫ్ట్‌లలో పారిశుధ్య నిర్వహణ
- నాలుగు లక్షల లడ్డూలు తయారీ
- బస్టాండ్ వద్ద ఏడు ప్రసాద, ఏడు టికెట్ కౌంటర్ల ఏర్పాటు
- ఆరు కేంద్రాల్లో మూడు షిఫ్ట్‌లలో కొండపైన, స్టేజీ వద్ద వైద్య సిబ్బంది విధులు
- మెట్ల మార్గంలో విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు 24గంటల విద్యుత్ సౌకర్యం, జనరేటర్‌ల ఏర్పాటు
- అందుబాటులో ఫైర్ ఇంజన్, అంబులెన్స్ సౌకర్యం
- భక్తులకు సరిపడా జగిత్యాల, వేములవాడ, కరీంనగర్ నుంచి ఆర్టీసీ బస్సుల సేవలు
- నాలుగు బ్లాక్‌లలో తాత్కాలిక మరుగుదొడ్లు, మొబైల్ మరుగుదొడ్లు



పాదయాత్రగా వస్తున్న దీక్షాపరులు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్



ఉత్సవమూర్తుల దీక్ష విరమణ మండప ప్రవేశానికి తీసుకువస్తున్న అర్చకులు

మంత్రుల పర్యటనకు భారీ భద్రత చర్యలు

- 300 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది
- సిరిసిల్ల ఎస్పీ మహేష్ బి గీతే



మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బీ గీతే

సిరిసిల్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల శివారులో అపెరల్ పార్కులో టెక్స్‌పోర్టుయూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముగ్గురుమంత్రులు వస్తున్న సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ మహేష్ బీ గీతే తెలిపారు. గురువారం జిల్లాపోలీస్ కార్యాలయంలో అధికారులతో భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం అపెరల్ పార్కులో టెక్స్‌పోర్టు యూనిట్ ప్రారంభోత్సవానికి మంత్రులు వస్తున్నా సందర్భంగా దాదాపు 300మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్టభద్రత ఏర్పాట్లు చేశామని తెలిపారు. యూనిట్ ప్రారంభోత్సవ ప్రాంగణంలో వీఐపీ గ్యాలరీ, సభ ప్రాంగణంలో వీవీఐపీ జనరల్ పార్కింగ్ ప్రదేశాల్లో బందోబస్తులో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సదన్‌కుమార్, మధుకర్, నాగేశ్వర్‌రావు, అర్ఐలు రమేష్, యాదగిరి, ఎస్ఐలు పాల్గొన్నారు.

84.1శాతం మొబైల్ ఫోన్లు రికవరీ

సిరిసిల్ల క్రైం: జిల్లాలో 84.1శాతం మొబైల్ ఫోన్‌ల రికవరీ చేశామని ఎస్పీ మహేశ్ బి గితే తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటుచేసిన సందర్భంగా రూ.10లక్షల విలువైన 100ఫోన్‌లను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 1587 ఫోన్‌లను బాధితులకు అందజేశామన్నారు. ఫోన్‌ల రికవరీలో, బాధితులకు అప్పగించడంలో కృషిచేస్తున్న ఐటి కోర్ ఎస్ఐ కిరణ్‌కుమార్, కానిస్టేబుల్ రాజా తిరుమలేష్‌ను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి డీఎస్పీ మురళీకృష్ణ, ఐటి కోర్ ఎస్ఐ కిరన్‌కుమార్, ఆర్ఐలు రమేశ్, యాదగిరి, ఎస్ఐ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్ జైలుకు వెళ్లడం ఖాయం

- ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్‌రావు అధికారాన్ని అడ్డుపెట్టుకొని సంపాదించిన అక్రమాస్తులపై విరారణ జరగుతుందని, వారంతా జైలుకు వెళ్లడం ఖాయమని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం అన్నారు. గురువారం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాంకు సంబంధించిన వేలాది ఎకరాల భూమిని తమ బినామీల పేరుమీదకు మార్చడానికే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి తీసుకువచ్చిందని ఆరోపించారు. ప్రాజెక్టులు, విద్యుత్ పేరుతో ఏడు లక్షల కోట్ల అప్పు చేశారని, అందులో వారు మూడు లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. పదేళ్ల కాలంలో పదివేల ఎకరాల భూమిని వారి బినామిల పేర్లమీదకు వెళ్లాయని ఆరోపించారు. సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే ఎస్సీ వర్గీకరణ చేసిందిని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కృషి చేస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీసీలపై ప్రేమ ఉంటే 42 శాతం రిజర్వేషన్ అమలుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందని, అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలన్న విషయం కవితకు అప్పుడు ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. సమావేశంలో సమావేశంలో గజ్జెల ఆనందరావు, సముద్రాల అజయ్, సుద్దాల లక్ష్మన్, అనిల్, ప్రభాకర్, శంకర్, కొండ్ర స్వరూప, ఆవారు లత, గొర్రె రాజయ్య, షైసని మనోహర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గణేష్‌నగర్‌లో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శీలం లక్ష్మణ్ ఆదేశాలతో ఏఎస్ఐ అబ్దుల్ జలీల్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరం పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకోగా మరో వ్యక్తి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి 24,900 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.

అంతర్ జిల్లా దొంగ పట్టివేత

- రూ.25 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- అరెస్టు చూపించి వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్



దొంగను అరెస్టు చూపిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కొన్నినెలలుగా తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌చేసి బంగారుఆభరణాలు దోచుకుంటున్న అంతర్‌జిల్లా దొంగను జగిత్యాలపోలీసులు పట్టుకున్నారు. రూ.25 లక్షల విలువగల 28.6తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఎస్పీ అశోక్‌కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి దొంగను అరెస్టు చూపించి పూర్తివివరాలు వెల్లడించారు. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన బక్కశెట్టికొమురయ్య అలియాస్ రేగులఅజయ్‌కుమార్(53) ఉపాధి కోసం మంచిర్యాల జిల్లాకేంద్రంలోని తిలక్ నగర్‌లో ఉంటూ దొంగతనాలు చేయడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. 10సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో లారీ ట్రాన్స్‌పోర్ట్‌లో పనిచేసే సమయంలో దొంగతనం చేసిన కొమురయ్య చంచల్‌గూడలో జైలు జీవితం అనుభవించాడు. బయటకు వచ్చిన అనంతరం 25దొంగతనాలు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ చౌరస్తాలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో కొమురయ్య అనుమానాస్పదంగా సంచరిస్తూ పట్టుబడ్డాడు. విచారణలో అంతర్ జిల్లా దొంగగా పోలీసులు గుర్తించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మూడు నెలల వ్యవధిలో ఏడు చోట్ల కొమురయ్య దొంగతనాలు చేసి 28.6 తులాల విలువైన బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు ఎస్పీ తెలిపారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకోవడంతో పాటు బంగారు ఆభరణాలు రికవరీ చేసిన టౌన్ ఇన్‌స్పెక్టర్ వేణు గోపాల్, ఎస్సైలు కిరణ్ కుమార్, గీతను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ రఘు చందర్ తదితరులు ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

బైకును వెనుక నుంచి ఢీకొట్టిన కారు

- చికిత్స పొందుతూ ఒకరు మృతి

శంకరపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్‌శివారులో ఫ్లైఓవర్ దగ్గర ద్విచక్రవాహనాన్ని కారు వెనుకనుంచి ఢీకొట్టిన ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, ఒకరు చికిత్సపొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్‌మండలం గర్రెపల్లికి చెందిన కొడగాని కిషన్‌రావు, తనభార్య శోభ(50), కూతురు అశ్వినితోకలిసి ద్విచక్రవాహనంపై ఎల్లంపల్లి నుంచి మానకొండూర్ మండలం నిజాయితీగూడెం వెళ్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం తాడికల్ శివారులోని ఫ్లైఓవర్ వద్దకు చేరుకోగానే కారు(ఏపీ09సీడబ్ల్యూ 0882) వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కిషన్‌రావు, అతని భార్య శోభ తలకు, తొంటి ఎముకకు, కూతురు అశ్వినికి రెండు కాళ్లకు, కంటి వద్ద తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శోభను మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. కిషన్‌రావు బావమరిది బూరాల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

కేజ్ కల్చర్ యూనిట్ల పరిశీలన

సిరిసిల్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లో చీర్లవంచ వద్ద ఫిషిన్ ఫార్మా ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ యూనిట్‌ను గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. రిజర్వాయర్‌లో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ యూనిట్‌లలో 4.2 లక్షల విత్తనాలను నిల్వ చేశారు. ప్రస్తుతం మిడ్ మానేరులో నీటి మట్టం తగ్గిపోతుండడంతో ఎక్కువగా పంజరాలను ఏర్పాటు చేయలేకపోతున్నామన్నారు. నీటి మట్టం 8 టీఎంసీలు మాత్రమే ఉన్నందున వేసవి కాలం పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా హెచ్చు తగ్గులు సంభవించే అవకాశం ఉందని ఫిషిన్ ఫాం ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకవచ్చారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో నీరు ఎక్కువ కాలం అధిక లోతు ఉండి ఇతర జలచరాల భద్రతకు భంగం కలగకుండా ఉండే అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వారి వెంట జిల్లా ఫిషరీస్ అధికారి సౌజన్యలు ఉన్నారు.



సూచనలు చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యం

- అభివృద్ధి నెపంతో మరోమారు కాంగ్రెస్ ముసుగులో జగిత్యాల ఎమ్మెల్యే అరాచకం
- మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



జగిత్యాలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేశారని, ప్రస్తుతం అభివృద్ధి నెపంతో కాంగ్రెస్ ముసుగులో మరోమారు అరాచకం చేయడానికి యత్నిస్తున్నాడని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా తాతల..తండ్రుల కాలం నుంచి కాంగ్రెస్ పార్టీ మాదేనని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అంటుండడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ దౌర్జన్యం తట్టుకోలేక హబ్సీపూర్ గ్రామానికి చెందిన యువకుడు సారంగపూర్ అడవుల్లో ఉరివేసుకొని మృతి చెందిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. జగిత్యాలకు చెందిన బ్లాక్ కాంగ్రెస్ నాయకుడిపై రౌడీషీట్ ఓపెన్ చేయించారని, బీఆర్ఎస్‌లో చేరనందుకు తుంగూరు సర్పంచ్‌ను పదవి నుంచి సస్పెండ్ చేయించారని ఆరోపించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి కీలక పాత్ర పోషించిన కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తానని జీవన్‌రెడ్డి తెలిపారు. గతంలో జగిత్యాలలో ఇళ్లు లేని నిరుపేదలకు 4వేల వ్యక్తిగత ఇళ్లు మంజూరు చేయించి నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. కొడిమ్యాల మండలం నాచుపల్లి వద్ద జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, పొలాసలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, నూకపల్లి వద్ద న్యాక్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కృషి చేశానని జీవన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో రాయికల్, పొలాస, బీర్పూర్ సీపీడబ్ల్యూ స్కీమ్ కోసం రూ.15 కోట్లు మంజూరు చేయించానన్నారు.

ఈ సమావేశంలో టీపీసీసీ సెక్రెటరీ బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్, గుంటి జగదీశ్వర్, రాధాకిషన్ రావు, పుప్పాల అశోక్, జితేందర్, మహిపాల్, మధు తదితరులు పాల్గొన్నారు.

అతివల్లో ఆశలు.. నేతన్నల్లో నిరాశ..

(5వ పేజీ తరువాయి)

స్టోర్‌రూంతో కలిపి అందిస్తారు. ఇందులో నాలుగు సెమీ ఆటోమేటిక్ మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రం, ఇస్తారు. పార్కులో 60 వార్పిన్ మిషన్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఒక్కో యూనిట్ ధర 8 లక్షలుగా ముందుగా నిర్ణయించారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.16.52 లక్షల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఇందులో 10 శాతం లబ్ధిదారుని వాటాధనం 50 శాతం ప్రభుత్వ రాయితీ, 40 శాతం బ్యాంక్ రుణం ఉండే విధంగా పథకానికి రూపకల్పన చేశారు. సిరిసిల్లలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేస్తున్న వీవింగ్ పార్కులో కొందరికే మరమగ్గాల యూనిట్లు దక్కే అవకాశం ఉండడంతో మిగతా కార్మికులు నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగంలో జియోట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 30,352 ఉన్నాయి. వీటిపై 6,500 మంది పనిచేస్తున్నారు. అనుబంధ పరిశ్రమల్లో మరో 6 వేల మంది వరకు పని చేస్తున్న వారు ఉన్నారు. ప్రభుత్వం మొదటి దశలో కేవలం 1,104 మందికే యూనిట్లను అందించడంతో మిగతా కార్మికులు నిరీక్షించే పరిస్థితి ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం పెరిగిన బడ్జెట్‌కు అనుగుణంగా రూ 386.88 కోట్లతో ఈ పథకాన్ని అమలు చేయడానికి మంత్రులు పూనుకుంటారని కార్మికుల్లో మళ్లీ ఆశలు మొదలయ్యాయి.



వర్కర్ టు ఓనర్ పథకం కోసం నిర్మించిన షెడ్లు

టెక్స్‌టైల్ జోన్‌పై నెరవేరని ఆశలు..

సిరిసిల్ల నేతన్నల దశాబ్దాల కల మెగా పవర్‌లూం క్లస్టర్. దేశంలో కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు మెగా క్లస్టర్‌లు ఇస్తున్నా సిరిసిల్ల నేత కార్మికులకు మాత్రం నిరాశను మిగిలిస్తూనే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిరిసిల్లను మెగా పవర్‌లూం లేదా క్లస్టర్‌గా మారుస్తుందని అందుకు అనుగుణంగా బడ్జెట్ వస్తుందని ప్రతిసారి బడ్జెట్ సమయంలో ఎదురు చూసిన కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు నిరాశనే కలిగిస్తున్నాయి. తాజా కేంద్ర. రాష్ట్ర బడ్జెట్‌లో మళ్లీ మెగా పవర్‌లూం క్లస్టర్‌పై నిరాశే మిగిలింది. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సిరిసిల్ల వస్త్ర సంక్షోభ సమయంలో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు సిరిసిల్లలో పర్యటించి టెక్స్‌టైల్ జోన్, మెగా పవర్‌లూం క్లస్టర్‌గా మార్చి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. శాశ్వత ఉపాధికి పవర్‌లూం క్లస్టర్ దోహదపడుతుందని భావించారు. కేంద్ర ప్రభుత్వం హామీలకే పరిమితమయ్యింది. తెలంగాణ ప్రభుత్వమైనా వరంగల్ తరహాలో భారీ టెక్స్‌టైల్ పరిశ్రమలకు బడ్జెట్ ఊతమిస్తారని భావించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మారిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంవత్సర కాలంగా ఒడిదొడుకులను ఎదుర్కొంది. ప్రభుత్వం దృష్టి సారించడంతో వస్త్ర పరిశ్రమలో ఆశలు చిగురించాయి. గత బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం టెక్స్‌టైల్ జోన్‌ను తీసుకవస్తుందని భావించినా ఆరు గ్యారంటీల పథకాలతోనే సరిపెట్టింది. ఈసారి రాష్ట్ర బడ్జెట్‌లో టెక్స్‌టైల్ జోన్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆశాజనకమైన కేటాయింపులు ఉంటాయని భావించినా బడ్జెట్ కేటాయించలేదు. సిరిసిల్ల మెగా పవర్‌లూం క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి ప్రతిపాదనలు పంపిస్తూనే ఉన్నారు. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి కావూరి సాంబశివరావును సిరిసిల్లకు రప్పించిన ఎమ్మెల్యే కేటీఆర్ అప్పటి ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్‌లు మెగా పవర్‌లూం క్లస్టర్ హామీని పొందారు. అప్పటి బడ్జెట్‌లోనే ప్రకటిస్తారని ఆశించారు. కానీ నిరాశే మిగిలింది. 2004లో తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి వద్ద 60 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కును రూ.7.73 కోట్లతో ఏర్పాటు చేశారు. టెక్స్‌టైల్ పార్కులో ఆధునిక మరమగ్గాలను స్థాపించారు. దేశ విదేశీ మార్కెట్‌లో అమ్ముడుపోయే విలువైన వస్త్రాలను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్న పార్కులోకి అనుబంధ పరిశ్రమలు రాకపోవడంతో ఉత్పత్తుల్లో మార్పులు రాలేదు. సిరిసిల్లలో లోటెక్నాలజీ మరమగ్గాలపై ఆధునిక ఉత్పత్తులు చేయలేక తరచూ పరిశ్రమ సంక్షోభాన్ని చవిచూసింది. ఆత్మహత్యలు, సంక్షోభం నేపథ్యంలో సిరిసిల్లలో మార్పులు తీసుకరావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించాయి. అప్పటి కేంద్ర ప్రభుత్వం సిరిసిల్ల మెగా పవర్‌లూం క్లస్టర్‌ను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మారిపోయి బీజేపీ ప్రభుత్వం రావడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. 2016 బడ్జెట్ సమయంలో మంత్రి కేటీఆర్ మూడు సార్లు ఢిల్లీకి వెళ్లి, అప్పటి చేనేత జౌళిశాఖ మంత్రి సంతోష్ గంగువార్‌లను కలిసి వస్త్ర పరిశ్రమ సమస్యలను వివరించారు. మెగా పవర్‌లూం క్లస్టర్ ప్రతిపాదనలు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి పంపించామని తెలపడంతో ఆ బడ్జెట్‌లో పవర్‌లూం క్లస్టర్ చోటు దక్కుతుందని భావించారు. మొదటి విడతలో దేశంలో ఐదు మెగా క్లస్టర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన సిరిసిల్లకు చోటు దక్కలేదు. 2017 బడ్జెట్ సమయంలో అప్పుడు చేనేత జౌళి శాఖ మంత్రిగా ఉన్నా కేటీఆర్, అప్పటి ఎంపీ వినోద్‌లు చేనేత జౌళి శాఖ మంత్రి స్మృతిఇరానీని కలిసి మెగా పవర్‌లూం క్లస్టర్‌ను సాధించుకునే విధంగా చర్యలు చేపట్టారు. కానీ ఆ బడ్జెట్‌లో కూడా మోక్షం లభించలేదు. అదేక్రమంలో 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024, 2025 బడ్జెట్‌లో కూడా అదే పరిస్థితి ఎదురైంది. సిరిసిల్లను టెక్స్‌టైల్ జోన్‌గా మార్చే దిశగా మంత్రులు వరాలు కురిపిస్తారని భావిస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ప్రభుత్వ విప్, కలెక్టర్

సిరిసిల్ల శివారులో అపెరల్ పార్కులో టెక్స్‌పోర్టు యూనిట్‌ను శుక్రవారం ఉదయం 11.30 గంటలకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు రానున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. గురువారం అపెరల్ పార్కులో ఏర్పాట్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, ఎస్పీ మహేష్ గీతే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. టెక్స్‌పోర్టు యూనిట్ ప్రారంభించడానికి వస్తున్న సందర్భంగా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

ఉచిత విద్య టాలెంట్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 24న పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ వారి ఉచిత విద్య టాలెంట్ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్కాల రవీందర్, జంగిటి రాజులు కోరారు. సిరిసిల్లలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామీణా నిరుపేద విద్యార్థులకు హైదరాబాద్ ప్రగతి నగర్‌లోని పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ విద్యాసంస్థలో ఉచిత విద్యను అందించే లక్ష్యంతో టాలెంట్ పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారన్నారు. దానిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 4,5,6 తరగతుల్లో విద్యార్థులు అర్హత పరీక్ష రాసి 5,6,7 తరగతుల్లో ప్రవేశంపొందాలన్నారు. దీనికోసం 80మార్కులకు పరీక్షలకు ఈ ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలుగు,గణితం, ఇంగ్లీష్‌తోపాటు పరిసరాల విజ్ఞానం నుంచి ప్రశ్నలు ఉంటాయన్నారు. ఒక్కొక్క సబ్జెక్టుకు 20 మార్కుల చొప్పున మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు, ఒక్క మాటలో జవాబు రూపంలో ప్రశ్నలు ఉంటాయని ఈ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- అహోబిలం స్వామీజీ చేతుల మీదుగా స్వామివారి కల్యాణం

కోనరావుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలని మల్కపేట శ్రీరామాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం అహోబిలం స్వామీజీ చేతుల మీదుగా శ్రీరాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అహోబిలం స్వామీజీ మాట్లాడుతూ శ్రీరామాలయం కట్టడాలు బాగుందని అన్నారు. కార్యక్రమంలో శ్రీరామాలయ నిర్మాత చల్మెడ ఆనందరావు, లక్ష్మీనరసింహారావు, వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు, సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు, వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రాజు, మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్, బండ నర్సయ్య, రామ్మోహన్‌రావు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు నోటీస్ అందజేసిన కార్మికులు



తంగళ్లపల్లిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

వీర్నపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19 నుంచి వీర్నపల్లి మండలం మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె చేసామని ఇన్‌చార్జి ఎంపీడీవో వాజిద్‌కు గురువారం నోటీసు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు అరుణ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మండలం అధ్యక్షులు న్యాత నర్సయ్య, కార్యదర్శి వినీత్, నాయకులు నర్సవ్వ, పూజ, నగేష్, శ్రీను, సురేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్ళపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 19వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జాలకు సమ్మె నోటీసులు అందజేశారు. మండల ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ప్రధానకార్యదర్శి పెంట రాజు, గౌరవ అధ్యక్షుడు కోల చంద్రం, ఉపాధ్యక్షులు కంసాని రవీందర్, లింగంపల్లి ప్రవళిక, రడం పద్మ, పసుల రమేష్, పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా



మున్సిపల్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల మున్సిపల్ పారిశుధ్య కార్మికులు విధులను బహిష్కరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో స్పందించిన కమిషనర్ సమ్మయ్య కార్మికులతో మాట్లాడారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీనివ్వడంతో కార్మికులు ధర్నా విరమించి విధులకు హాజరయ్యారు.

సంక్షిప్త సమాచారం

బీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా వనరాజు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) బహుజన టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడిగా తేలు వనరాజు, ప్రధాన కార్యదర్శిగా అడెపు సంపత్‌కుమార్‌లను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మల్లేశం, ప్రధాన కార్యదర్శి కర్రోల్ల రాజలింగంలు పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. నూతనంగా నియామకం అయిన వారికి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్ అభినందనలు తెలిపారు.

నిరుపేద కళాకారుడికి ఆర్థిక సహాయం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన నిరుపేద కళాకారుడు తునికి తిరుపతికి పెద్దలింగాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ గురువారం ఆర్థిక సహాయం అందించారు. తిరుపతి కళారంగంపై ఉన్న మక్కువతో కవితలు, ఏకపాత్రాభినయాలు, వ్యాసాలు రాస్తూ జాతీయస్థాయిలో నంది అవార్డు, గౌరవ డాక్టరేట్ పట్టాను పొందాడు. ఇతర రాష్ట్రాలలో జరిగే పోటీలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని తిరుపతి తెలుపగా మాజీ సర్పంచ్ రూ 5వేలు, మాజీ ఉపసర్పంచ్ రేగుల బిక్షపతి రూ 1100 ఇవ్వడంతో పాటు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గన్నారం నర్సయ్య తదితరులు ఉన్నారు.

నువ్వు పంట సాగుపై అవగాహన

ఇల్లంతకుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నువ్వుపంట సాగుతో రైతులకు అదనపు లాభం కలుగుతుందని ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలో గురువారం నువ్వు సాగు మీద అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలంలో సాగుచేసే పత్తిపంట కాలాన్ని పొడిగించకుండా నువ్వుపంటను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో లలిత, ఉత్తమ రైతులు కరుణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

నెహ్రూనగర్ పాఠశాలలో 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్'

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ మండల పరిషత్ పాఠశాలలో గురువారం ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న వారికి మండల విద్యాధికారి దూస రఘుపతి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గణేష్, ఉపాధ్యాయులు వాసాల హరిప్రసాద్, రఫీయోద్దీన్, త్రివేణి, చందన, కరుణ, కవితలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

వేములవాడ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిధులతో బొల్లారం గ్రామంలో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు గురువారం బీజేపీ నాయకులు ప్రజలతో కలిసి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల తిరుపతి, చెట్టిపల్లి రవికిషోర్, ప్రధాన కార్యదర్శి గోపు ప్రవీణ్, నాయకులు కంకణాల రాజు, సండె సారి మల్లికార్జున్, వినోద్, గౌతమ్, ఆకుల బాబు, మంద రాజేందర్, తోట శేఖర్, మల్లారం తిరుపతి, ఆవునూరి తిరుపతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'మున్నూరుకాపు సింహ గర్జనను బహిష్కరిస్తాం'

రుద్రంగి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మున్నూరుకాపు సింహ గర్జనను బహిష్కరిస్తున్నట్లు రుద్రంగి మండల మున్నూరుకాపు సంఘల నాయకులు తెలిపారు. గురు వారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి మాట్లాడుతూ మున్నూరు కాపు కులాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కులాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేయడం సరికాదన్నారు. అందుకే భాగంగానే సింహగర్జనను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. తూం జలపతి, చెలుకల గంగాధర్, కంటే నర్సయ్య, ఇప్ప నరేష్, ఎర్రం రాజలింగం, గంగాధర్, రాజం, రాజనర్సయ్య, లింగారెడ్డి, గంగారాం పాల్గొన్నారు.

వట్టిమల్లలో 'గావ్ చలో.. బస్తీ చలో'

కోనరావుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మట్టిమల్ల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ ఆధ్వర్యంలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం రామాలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ్, సుధాకర్, శ్రీకాంత్, హనుమాన్లు, జలపతి, శ్రీనివాస్, విజయ్, రవి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు.. హామీ నెరవేర్చిన విప్

కోనరావుపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌లో గురువారం అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు స్తంభాలను ఏర్పాటు చేశారు. గత సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాగా, కొనుగోలు కేంద్రంలో లైట్లు లేక రాత్రి పూట ఇబ్బంది అవుతోందని రైతులు మొరపెట్టుకున్నారు. స్పందించిన విప్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభాలకు నిధులు మంజూరు చేశారు. పనులు పూర్తికాలేవని తెలుసుకుని రెండురోజుల్లో పూర్తిచేయాలని బుధవారం అధికారులను ఆదేశించారు. గురువారం పనులు పూర్తికావడంతో ప్ర భుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు పలువురు రైతులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు



సిరిసిల్లలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని 13,15,27 వార్డుల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు నిర్వహించారు. వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఏఐసీసీ కోఆర్డినేటర్ ఆవేజ్ ఆవిష్కరించారు. సిరిసిల్ల పట్టణం పాత బస్టాండ్ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి నాయకులు పూలతో నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏఐసీసీ కో ఆర్డినేటర్ ఆవేజ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్ ఆకునూరి విజయనిర్మల బాలరాజు, వెంగళ లక్ష్మీనర్సయ్య, కత్తెర దేవదాస్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్‌చైర్మన్ నీలి రవీందర్, మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు వైద్య శివప్రసాద్, కోడం శ్రీనివాస్, అన్నల్‌దాస్ భాను, కల్లూరి చందన, బూర్ల యాదగిరి, రాపెల్లి కళ్యాణ్, నక్క నర్సయ్య, రషీద్, కె రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం, రాచర్లతిమ్మాపూర్ గ్రామాల్లో గురువారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు చేపట్టారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, రాజేందర్, తిరుపతిరెడ్డి, రాజునాయక్, లక్ష్మీ, బాలయ్య, భాస్కర్, దేవేందర్, శ్రీనివాస్, సత్యనారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, మల్లుపల్లి, తుర్కాష్‌పల్లి గ్రామాల్లో గురువారం రాజ్యంగ పరిరక్షణ పాదయాత్రను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ అంబేద్కర్, మహత్మగాంధీ, సుబాష్ చంద్రబోస్, చాకలి ఐలమ్మల విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ, బీసీ సంక్షేమ సం ఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, ఏఎంసీ డైరె క్టర్లు భూక్య విఠల్, బాల్‌రెడ్డి, గంగరాజుగౌడ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి రామ చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు కిషన్‌గౌడ్, మాజీ సర్పంచ్ భూమరాజం, పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జీ గౌరిశంకర్, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ప్రవీన్‌కుమా ర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సురేష్ ఉన్నారు.


● చందుర్తి : చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి తిమ్మాపూర్, రామన్నపేట గ్రామాల్లో గురువారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బొజ్జ మల్లేశం, నాయకులు భీమరాజు కనకరాజు, వెల్పుల దేవస్వామి, అంచ రాంరెడ్డి, గొట్టే ప్రభాకర్, బాణాల రవీందర్‌రెడ్డి, లింగంపల్లి అజయ్, ఇందూరి మధు, శ్రీకాంత్, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలంలోని రామన్నపేట, కొలనూరు గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య పాల్గొని, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్లు నాయని ప్రభాకర్ రెడ్డి, వెంగలి వెంకన్న, కాంగ్రెస్ జిల్లా నాయకులు నాలుక సత్యం, బండి ప్రభాకర్, గొట్టే రుక్మిణి, నూగూరి గణేష్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : తంగళ్ళపల్లి మండలం చిన్నలింగాపూర్, నర్సింహులపల్లి, బాలమల్లుపల్లె గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, నాయకులు బైరినేని రాము, కాబట్టి మల్లేశం యాదవ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్‌లోని విలీన గ్రామాలైన చిన్నబోనాల, పెద్దబోనాల, చంద్రంపేట గ్రామాల్లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ పాలకవర్గంతో కలిసి సిరిసిల్ల వ్యవ సాయ మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ వెల్మూల స్వరూప తిరుపతిరెడ్డి ప్రారంభించారు. మెప్మ ఏవో రామలక్ష్మీ, మార్కెట్ కమిటి వైస్‌చైర్మ న్ నేరేళ్ల నర్సింగంగౌడ్, డైరెక్టర్‌లు దుబాల వెంకటేషం, అడెపు జగన్, మాజీ వైస్ ఎంపీపీ చల్ల హరి కృష్ణ, వెల్మూల తిరుపతిరెడ్డి, చంద్రంపేట వార్డు అధ్యక్షుడు నూనె శ్రీనివాస్, తడక వెంటేష్, కోడం నాగభూషణం, కత్తెరపాక ఎల్లయ్య, బైరగోని రేణుక, కొలాపూరి ఎల్లయ్య, నక్క ఎల్లయ్య, శ్రావణ్, లింగంపల్లి గంగరాజు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అఫ్జల్‌బేగం

● గంభీరావుపేట : గంభీరావుపేట మండల మల్లుపల్లి గ్రామంలో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, ఏఎంసీ డైరెక్టర్ గంగరాజు, నాయకులు మరాఠీ భూదయ్య, బూనవేణి రాజు, రావర్తి బాబు, బొల్లు సత్యం ఉన్నారు.

● ముస్తాబాద్: మండలం చిప్పలపల్లి, గూడూరు, మొర్రాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, అధికారులు, నాయకులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు కిషన్‌దాస్‌పేట, రాచర్లతిమ్మాపూర్, కోరుట్లపేట, రాచర్లగొల్లపల్లి, బాకురుపల్లితండా, రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్ గ్రామాల్లో సెర్ప్-ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గురువారం ప్రారంభించారు. తహసీల్దార్ సుజాత, ఐకేపీ ఏపీఎం మల్లేశం, నాయకులు రాంరెడ్డి, నర్సయ్య, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, రాజేందర్, రవీందర్, బాలయ్య, లక్ష్మీ, శ్రీనివాస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, బాబు, రాజయ్య, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల ఆధ్వర్యంలో గురువారం పెద్దలింగాపూర్, దాచారం, సిరికొండ, అనంతగిరి, తెనుగువానిపల్లె గ్రామాలలో వరిదాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ఫారూఖ్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ప్రసాద్ ప్రారంభించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, ఆర్ఐ సంతోష్, ఏపీఎం వాణిశ్రీ, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, పాశం రాజేందర్‌రెడ్డి, కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరెడ్డి, రజనీకాంత్, నర్సింగం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న రాధికా జైస్వాల్

వేములవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : చట్టపరంగా మహిళలకు సైతం సమాన హక్కులు ఉన్నాయని, ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సిరిసిల్ల సివిల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ సాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ అన్నారు. వేములవాడ పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి వివిధ రకాల హక్కులు లభించాయని, ఇదే క్రమంలో మహిళలకు సమాన హక్కులు ఉన్నాయని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి మహిళలు అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల నుంచి మొదలుకొని ప్రతి ఒక్కరికి చట్టాలలో ఉన్న హక్కులు వాటిని సద్వినియోగం చేసుకునే అంశంపై ప్రతి ఒక్కరు తెలుసుకున్నప్పుడే న్యాయాన్ని పొందగలుగుతారని సూచించారు. న్యాయస్థానం అందరికీ అందుబాటులో ఉండి సమాన హక్కులు కల్పిస్తుందని భావించాలన్నారు. మహిళలకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనా, ఇతర సమస్యలు ఉన్న న్యాయస్థానాన్ని ఆశ్రయించి తమను తాము కాపాడుకునే హక్కులు ఉన్నాయని వాటిని వివరించారు. విద్యావంతులుగా సమాజానికి అందుతున్న తరుణంలో ప్రతి విషయంపై అవగాహన పెంపొందించుకొని తమ వంతుగా సహాయాన్ని అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, సేవా సేవా సంస్థ సభ్యుడు కుమార్, న్యాయవాది రమేష్, ప్రిన్సిపాల్ కే లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు అధ్యాపకులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

చందుర్తి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేముల సుజాత అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు అడ్మిషన్లు తీసుకున్నారు. గొల్లవాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుర్రం బాలకిషన్, ఉపాధ్యాయులు రాచకొండ ప్రసాద్, కొత్తూరి శ్రీధర్, రాకం రవికుమార్, కాపిల్ల నరేష్, మమత, స్వప్న జ్యోతి, శైలజ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికపై ఉత్కంఠకు తెర..

- చెరో ఆరు నెలలు కొనసాగాలని నిర్ణయం



సదానందం, రవిలను సన్మానిస్తున్న న్యాయవాదులు

వేములవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానం కోసం ఎన్నికపై ఏర్పడిన ఉత్కంఠకు తెరపడింది. అధ్యక్షుడిగా పోటీ చేసిన గుడిసె సదానందం, గుండ రవి ఇద్దరికీ సమానంగా ఓట్లు రావడంతో ఎన్నిక టై అయ్యింది. ఎన్నికల అధికారి గోపికృష్ణ, న్యాయవాదులు ఇరువర్గాలతో చర్చించి రాజీ కుదిరించడంతో అధ్యక్ష స్థానాన్ని ఇద్దరూ ఆరు మాసాల చొప్పున పంచుకోవడానికి అంగీకరించారు. తొలి ఆరు మాసాలు అధ్యక్షుడుగా గుండా రవి కొనసాగనుండగా, తదుపరి ఆరు మాసాలు గుడిసె సదానందం అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. అధ్యక్ష స్థానానికి ఏర్పడిన ఉత్కంఠ వేయడంతో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, పిట్టల మనోహర్, పురుషోత్తం, సంపత్, తదితరులు పాల్గొన్నారు.